క్లుప్తంగా

కేశనకుర్రులో 'పొలంబడి'



రైతులతో మాట్లాడుతున్న ఏవో వాణి

ఐ.పోలవరం: కేశనకుర్రు–1 రైతు భరోసా కేంద్రం పరిధిలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి ఎం.వాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులను గ్రూపులుగా విభజించి 14 వారాల పాటు పొలంబడి నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించడానికి, సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించడానికి ఇది దోహదపడుతుందని అన్నారు. ఫీల్డ్ లేఅవుట్, మట్టి పరీక్షా ఫలితాలు తదితరాలపై రైతులకు వివరించారు. వీఏఏ జి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అల్లవరం హైస్కూల్‌లో మొక్క నాటుతున్న ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ గౌతమి

అల్లవరం: పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధి హామీ పథకం ఏపీఓ శ్రీనుబాబు ఆధ్వర్యంలో అల్లవరం హైస్కూల్‌లో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ బొమ్ము బాలవేణి, పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీడీఓ కృష్ణమోహన్, హెచ్ఎం వెంకటేశ్వరరావు, కార్యదర్శి రాజమోహన్, దాసం రాంబాబు, కొప్పాడి వెర్రియ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సురిబాబు పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమిద్దాం..

ఉప్పలగుప్తం: చెట్లను విధిగా పెంచి ప్రకృతిని ప్రేమిద్దామని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ చెరువు వద్ద ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఉపాధి ఏపీవో వి.రాజామణి మొక్కలు నాటారు. ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, దంగేటి రాంబాబు, చప్పిడి దుర్గారావు, మారిశెట్టి పుండరీకాక్షుడు, పరమట సత్యనారాయణ పాల్గొన్నారు.

కుండలేశ్వరునికి ప్రత్యేక పూజలు



కుండలేశ్వరంలో స్వామివారికి పూజలు

కాట్రేనికోన: కుండలేశ్వరంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత కుండలేశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కళ్లకూరి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వచ్చే నెల 27న ఎల్‌డీసీ ఉద్యోగ పరీక్ష

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)లు, స్టోర్ కీపర్ గ్రేడ్–3 పోస్టుల భర్తీకి వచ్చే నెల 27న రాత పరీక్ష నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ విషయాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ వింగ్ కార్యదర్శి వి.జయశంకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టిక్కెట్ల విడుదల, పరీక్ష కేంద్రాలు తదితర వివరాలను త్వరలో తెలియజేస్తామన్నారు.

చైతన్య రథం ప్రారంభం

ముమ్మిడివరం: అనాతవరంలో టీడీపీ మహిళా శక్తి చైతన్య రథాన్ని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, పెచ్చెటి విజయలక్ష్మి, గుత్తుల సాయి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల అరెస్టు, విడుదల

అమలాపురం టౌన్: మంత్రి జోగి రమేష్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ స్థానికంగా జనసేన నాయకులు ఆందోళన చేసేందుకు సిద్ధం కాగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విడుదల చేయాలంటూ స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట జనసేన నాయకులు నిరసనకు దిగారు. దీంతో డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ డి.దుర్గాశేఖరరెడ్డి, ఎస్సైలు హరీష్‌కుమార్, ప్రభాకరరావు ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేసి తర్వాత సొంత పూచీకత్తులపై విడుదల చేశారు.

అంతకంతకూ పెరుగుతూ..

- వరద నీటితో అతలాకుతలం
- ముంపు బారిన లంక పొలాలు
- ఆయా ప్రాంతాల్లో మంత్రి పర్యటన



సలాదివారిపాలెంలో కోతకు గురవుతున్న కొబ్బరి తోటలు



బోడసకుర్రులో వరద బాధితులకు భోజనాలు వడ్డిస్తున్న అధికారులు

ఐ.పోలవరం: వరద ఒకింత నిద్రపోనివ్వడం లేదు.. లంక వాసుల గుండెల్లో దడ పుట్టిస్తోంది.. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు వరద నీటి ప్రవాహం అధికంగా చేరుతోంది. అక్కడి నుంచి అధిక మొత్తంలో నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కోనసీమలోని పలు ప్రాంతాలు, లంక భూములు ముంపు నీట చిక్కుకున్నాయి. ఐ.పోలవరం మండలంలోని పలు గ్రామాల్లోని లంక పొలాలు నీట మునిగాయి. మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద, నూతన అన్నంపల్లి అక్విడెక్టు, పశువుల్లంక మెండి వద్ద, ఎదుర్లంక, జి.మూలపొలం వద్ద వృద్ధ గౌతమీ గోదావరి ప్రవాహం అధికంగా ఉంది. కేశనకుర్రు పంచాయతీ పరిధి పొగాకులంక, పల్లెగూడెం, కన్నపులంకలలో బీర, బెండ, దొండ, వంగ మొక్కలు నీట మునిగాయి. లంక ప్రాంతాల నుంచి బయటకు రావడానికి వీలులేక అక్కడి వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇళ్ల వద్దే ఉండటం వల్ల కూలీలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. లంక ప్రాంతాల్లో పండించే పశుగ్రాసం నీట మునగటంతో పచ్చగడ్డిని రైతులు నావలపై మోపులు కట్టి గట్టుకు తీసుకు వస్తున్నారు. అలాగే పశువుల పాకలు, ఎండుగడ్డి మేటలు, రొయ్యల చెరువులు నీట మునిగాయి. వరద ఉధృతి నేపథ్యంలో లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జి.మూలపాలెం, గుత్తెనదీవి, కేశనకుర్రు ర్యాంపులను నిలిపివేశారు. రేవుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఉధృతంగా గౌతమీ గోదావరి

యానాం: గౌతమీ గోదావరి ఉధృతం కావడంతో తీర గ్రామాలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. స్థానిక రాజీవ్‌బీచ్ ప్రాంతంలోని పార్క్ తదితర చోట్ల వరద నీరు చేరింది. ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గోదావరి పెరిగితే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా సిద్ధం కావాలన్నారు.

తాళ్లరేవు: పిల్లంక పంచాయతీ కొత్తలంకలో వరద సహాయక చర్యలపై అధికారులతో కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ సమీక్షించారు. కొత్తలంకలో ఆయన పర్యటించారు. ముఖ్యంగా తాగునీరు, వైద్యం, పడవల ఏర్పాటు, పశువులకు మేత తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. జెడ్పీటీసీ దొమ్మేటి శామ్యూల్ సాగర్, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ ఉన్నారు.



యానాం రాజీవ్ పార్కులో వరద నీరు

అప్రమత్తంగా ఉండండి: కలెక్టర్

ముమ్మిడివరం: వరదల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠానేల్లంక శివారు గురజాపులంకలో వరద పరిస్థితిని ఆయన పరిశీలించారు. వరద తీవ్రత పెరిగితే వెంటనే పునరావాస కేంద్రాలకు ప్రజలు తరలివెళ్లాలని, అక్కడ జిల్లా యంత్రాంగం అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. ఇప్పటికే ముంపు ప్రభావిత గ్రామాల్లో సహాయ పునరావాస కార్యక్రమాల ఏర్పాట్లు చేశారన్నారు. అలాగే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తమ గ్రామానికి బ్రిడ్జి నిర్మించాలని, వరద నీరు రాకుండా అడ్డుకట్ట వేయాలని కలెక్టర్‌ను ప్రజలు కోరారు. ఈ విషయాలపై క్షేత్రస్థాయిలో విచారించి తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన అన్నారు. తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ యడ్ల రాంబాబు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక వాసుల్లో ఆందోళన మొదలైంది. మండలంలోని లంకాఫ్‌ఠానేల్లంక, గురజాపులంక, కూనాలంక, సలాదివారిపాలెం, కమిని గ్రామాల ప్రజలకు వరదలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. లంకల్లో సుమారు 300 ఎకరాల్లో అరటి, కొబ్బరి, కూరగాయల తోటలు ముంపు బారినపడే అవకాశముందని రైతులు అంటున్నారు. నదీ ప్రవాహానికి పంట భూములు కోతకు గురవుతున్నాయని వాపోతున్నారు.

కాట్రేనికోన: మండలంలో నడవపల్లి, పలంకుర్రు రేవు ప్రాంతం, బలుసుతిప్ప గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. గంట గంటకూ వరద నీరు పెరగడంతో నదీ పరివాహక ప్రాంతాల్లో రొయ్యల చెరువుల్లో పట్టుబడి చేస్తున్నారు. అకాలంగా పట్టుబడి చేయడంతో తీవ్రంగా నష్ట పోతున్నామని రైతులంటున్నారు. పలంకుర్రు శివారు బూలవారిపేట ఏటిగట్టు బలహీనంగా ఉండటంతో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇసుక బస్తాలను సిద్ధం చేశారు. ఆ ప్రాంతాన్ని పల్లంకుర్రు సర్పంచ్ నాతి అలివేణి, నాతి సత్య నారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ పరిశీలించారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రి పర్యటన

అల్లవరం: వరద నీటితో బోడసకుర్రు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న మత్స్యకార కాలనీ ముంపు బారిన పడింది. సుమారు 50 ఇళ్లను ముంపు నీరు తాకింది. ఈ కాలనీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆర్డీఓ వసంతరాయుడుతో కలసి పరిశీలించారు. వరద బాధితులను పునరావాస కేంద్రానికి తరలించి, భోజనాలు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పార్టీ టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, తుని పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీను, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఎంపీడీఓ కృష్ణమోహన్, సీఐ వీరబాబు, ఎస్సై శ్రీను నాయక్ ఉన్నారు. సాయంత్రానికి వరద భారీగా పెరగడంతో పల్లపు ప్రాంతాల్లోని బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. వైనతేయ నదికి చేరిన వరద గోపాయిలంక అక్విడెక్టు నుంచి కుమ్మరి కాలువలోకి ఎదురెక్కి అక్కడ నదిని తలపిస్తుంది. కుమ్మరి కాలువలోకి చేరిన వరద నీటితో ఎస్సీ శ్మశాన వాటిక వద్ద ఏటిగట్టుకు గండి పడింది. సర్పంచ్ విజయలక్ష్మి, తహసీల్దార్ సాంబశివప్రసాద్ గండి పడిన పడిన ప్రదేశాన్ని పరిశీలించి డ్రైన్ డీఈ కిశోర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే గండి పూడ్చకపోతే గ్రామం వరదలో చిక్కుకుంటుందని తెలిపారు.



వరద నీరు చేరడంతో ఎదుర్లంక చెరువులో రొయ్యలు పడుతున్న రైతులు



కేశనకుర్రు పొగాకులంకలో పశువుల పాక చుట్టూ నీరు



కుమ్మరి కాలువకు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్, సర్పంచ్ విజయలక్ష్మి

టిడ్కో కాలనీకి బస్సు సర్వీసు



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని టిడ్కో భవన సముదాయానికి అమలాపురం డిపో నుంచి రోజుకు రెండు పర్యాయాలు రాకపోకలు సాగించే విధంగా బస్సు సర్వీస్‌ను శుక్రవారం మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో భవనాల నుంచి బస్సు సర్వీసు వేయాలని లబ్ధిదారుల కోరిన 24 గంటల వ్యవధిలో సర్వీసును ప్రారంభించామన్నారు. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత లబ్ధిదారులపై ఉందన్నారు. టిడ్కో కాలనీలో డ్రైనేజీ ప్రధాన సమస్యగా ఉందని, దీనిపై ప్రతిపాదనలు తయారుచేసి ముఖ్యమంత్రికి పంపించామన్నారు. నిధులు మంజూరైన వెంటనే భూసేకరణ చేసి శాశ్వతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని మంత్రి అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి నాగేంద్రమణి, కమిషనర్ అయ్యప్పనాయుడు, ఎంపీటీసీ బస్వాని పద్మ, పార్టీ టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, చెల్లుబోయిన శ్రీను, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, అడపా శ్రీను, అంబటి శ్రీను, జల్లి రాధాకృష్ణ, సుధాగణపతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌కు వినతి



మంత్రి జోగి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

అమలాపురం రూరల్: ఎన్నో ఏళ్లుగా పంచాయతీల్లో కాంట్రాక్టు ఉద్యోగులుగా చేస్తున్న తమను క్రమబద్ధీకరించాలంటూ శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌కు ఆ సంఘ సభ్యులు వినతిపత్రం అందించారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల యూనియన్ అధ్యక్షుడు రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు, కార్యదర్శి నిమ్మకాయల సాయిరామ్, అడబాల రాజా, ప్రచార కార్యదర్శి సింగంపల్లి దుర్గాశ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు. కార్యక్రమంలో దారా రామకృష్ణ, కోలా నాగు, నల్లా సతీష్, అక్కిశెట్టి శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు మేలు

తాళ్లరేవు: జగనన్న సురక్ష కార్యక్రమంతో అర్హులకు మేలు జరుగుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. శుక్రవారం చొల్లంగి పంచాయతీలో బూరెల వెంకట్రాజు, చొల్లంగిపేటలో సర్పంచ్ కందెళ్ల గంగాభవాని అధ్యక్షతన జరిగిన సభలలో ఎంపీపీ మాట్లాడారు. ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు చేరవేస్తున్న వలంటీర్లను విమర్శించడం ప్రతిపక్షాలకు తగదన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. చొల్లంగిలో 1,050, చొల్లంగిపేటలో 350 మందికి పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్‌సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఈఓపీఆర్‌డీ మల్లాడి భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.



చొల్లంగిలో మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

మణిపూర్ ఘటనలపై నిరసన



అమలాపురం కోర్టు భవనం వద్ద నిరసన తెలుపుతున్న బార్ అసోయేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు

అమలాపురం టౌన్: మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న దాడులు, మారణ హోమాలను అమలాపురం బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం స్థానిక కోర్టు సముదాయాల భవనం వద్ద న్యాయవాదులు నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూపీ లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు డీబీ లోక్, ఎండీ ఆజామ్ మాట్లాడుతూ మణిపూర్‌లో అక్కడి ప్రభుత్వం శాంతి భద్రతలను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేసి, మహిళలకు రక్షణ కల్పించాలని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి బదుగు భాస్కర్ జోగేష్, న్యాయవాదులు కుడుపూడి త్రినాథ్, మాకే ఆదినారాయణ, పినిపే రాధాకృష్ణ, యార్లగడ్డ రవీంద్ర, చంద్రశేఖర్, జి.శ్రీదేవి, ఝాన్సీ, లీలారాణి, గీత తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధి టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ మణిపూర్‌లో వివిధ తెగల మధ్య ప్రారంభమైన ఘర్షణలు అనేక అకృత్యాలకు దారి తీశాయన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించడం అనాగరిక చర్య అన్నారు. గ్రామాలను తగులబెట్టి గిరిజనులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు నిరసన

ఐ.పోలవరం: తనకు న్యాయం చేయాలంటూ తిళ్లకుప్పలో భర్త ఇంటి ముందు ఓ మహిళ శుక్రవారం ఆందోళనకు దిగింది. హైదరాబాద్‌కు చెందిన సంధ్య, తిళ్లకుప్పకు చెందిన వై.శ్రీనివాస్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సుమారు 12 నెలల పాటు తనతో కాపురం చేశాడని, అనంతరం అక్కడి నుంచి తన భర్త వచ్చేశాడని సంధ్య తెలిపింది. శ్రీనివాస్‌కు మరో వివాహం చేయాలని అతని కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారని పేర్కొంది. ఆమె నిరసనకు సీసీఐడీ నేషనల్ కమిటీ చైర్‌పర్సన్ బి.శివపావని ఆధ్వర్యంలో మహిళా సంఘాలు మద్దతు తెలిపాయి.

సాగుకు సౌకర్యాలు కల్పించండి



ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేసిన రైతులు

యానాం: ఫ్రాన్స్‌తిప్ప ప్రాంతంలో సాగుకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం కనకాలపేట అగ్రికల్చరల్ ఫీల్డ్ లేబర్ సొసైటీ రైతులు ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్రాన్స్‌తిప్ప లంక భూముల్లో సాగుకు ఆయిల్ ఇంజిన్ మోటార్లు వినియోగిస్తున్నామన్నారు. ఆ మోటార్లు పూర్తిగా పాడైపోవడంతో సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలువలో గుర్రపుడెక్క సైతం సాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారిందన్నారు. తమకు మోటార్ల ప్రభుత్వం ద్వారా మంజూరు చేయాలని, భూముల చుట్టూ కంచె నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపల్లి లోవరాజు, చేటకాల వెంకటేశ్వర్లు, దడాల అప్పాయమ్మ, చెల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాజ్‌వేను పరిశీలించిన మంత్రులు

అయినవిల్లి: వరద బాధితులను ప్రభుత్వం, అధికార యంత్రాగం అప్రమత్తం అయ్యిందని, అందులో భాగంగానే తక్షణ సహాయక చర్యలు చేపట్టిందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, రాష్ట్ర రవాణా మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లి లంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని మంత్రులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వరద సహాయక చర్యల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికే నిమగ్నమయ్యారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను తక్షణం నెరవేరుస్తారన్నారు. పడవలపై లంక ప్రాంత ప్రజలను దాటించే సమయంలో చిన్నారులను, విద్యార్థులను ప్రయాణించకుండా నిలిపి వేయాలన్నారు. అత్యవసర పనులకు మాత్రమే వరద సమయంలో పడవలపై ప్రయాణం చేయాలన్నారు. లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదగాడవిల్లిలో చోరీ

ఉప్పలగుప్తం: ఓ ఇంట్లో చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదగాడవిల్లికి చెందిన నూకల సోమరాజు ఈ నెల 14న ఇంటికి తాళం వేసుకుని బెంగళూరులోని కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా ఎల్ఈడీ టీవీ, తొమ్మిది కాసుల బంగారం, కేజీ వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు సోమరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ టీం ఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించింది.

దొమ్మేటి సేవలు ఎనలేనివి

ఉప్పలగుప్తం: శెట్టిబలిజల జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి సామాజిక వర్గానికి అందించిన సేవలు ఎనలేనివని ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ సంఘ కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఎస్.యానం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన వెంకటరెడ్డి విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుడుపూడి త్రినాథ్, వై.కరుణాకర్, కేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

పూర్తిస్థాయి విచారణ చేపట్టాలి

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ఉప సర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, వార్డు సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇటీవల జిల్లా స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ స్పందించి పంచాయతీ డివిజనల్ అధికారిని విచారణకు పంపారని, అయితే ఫిర్యాదు దారులమైన తమకు కాల వ్యవధి లేకుండా ఒక్కరోజు ముందు నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకించామన్నారు. తాము లేకుండా తూతూ మంత్రంగా విచారణ చేయడం సరికాదని కె.లోకేష్, కె.వెంకటేశ్వరరావు, పోతాబత్తుల రాంబాబు తదితరులు అన్నారు.

అర్హులకు నష్ట పరిహారాన్ని అందించాలి

యానాం: నియోజకవర్గ పరిధిలో మత్స్యకారులకు ఓఎన్జీసీ అందించిన నష్ట పరిహారాన్ని దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఇవ్వాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. శుక్రవారం స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో మత్స్యకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట నష్ట పరిహారానికి సంబంధించి పలు పేర్లను అకారణంగా జాబితా నుంచి తొలగించారని అన్నారు. వచ్చే నెల 10వ తేదీలోగా పరిహారం మొత్తాన్ని అందించకపోతే ఉద్యమానికి సైతం వెనకాడనని స్పష్టం చేశారు. మత్స్యకార నాయకులు శేరు కృష్ణ, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, చింతా వెంకటేశ్వర్లు, మల్లాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకార ఊరేగింపు



దోలామణి రుద్ర, మంత్రి విశ్వరూప్‌లను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం మార్కెట్ కమిటీ తొలి మహిళా చైర్ పర్సన్‌గా బండారులంక గ్రామానికి చెందిన దంగేటి డోలామణి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత అమలాపురంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఊరేగింపు నిర్వహించారు. డోలామణి రుద్ర దంపతులు బండారులంకలో వారి స్వగృహం నుంచి ఊరేగింపును ప్రారంభించారు. వీరిని మంత్రి విశ్వరూప్ సత్కరించారు. నియోజకవర్గం నుంచి వేలాది మంది కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ ర్యాలీ వెంట సాగారు. ఈదరపల్లి వంతెన వద్ద అంబేడ్కర్ విగ్రహానికి, అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో దివంగత మాజీ సీఎం రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి కుడుపూడి ప్రభాకరరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక కాలేజీ రోడ్డు మీదుగా కొంకాపల్లిలో క్షత్రియ కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి తరలివెళ్లారు. పట్టణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సంసాని బుల్లినాని, బొంతు గోవిందు శెట్టి, సర్పంచులు దాసరి అరుణ, నక్కా అరుణకుమారి, గుత్తుల చిరంజీవి, డాక్టర్ పినిపే శ్రీకాంత్, సొసైటీ అధ్యక్షుడు దంగేటి బుల్లబ్బులు తదితరులు పాల్గొన్నారు.